క్లుప్తంగా

ఘనంగా బోనాల పండుగ



బోధన్: పట్టణంలోని ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బోనం ఎత్తుకున్నారు. ఆలయంలో అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌలికార్ నర్సింగ్‌రావు, జయ నర్సింగ్‌రావు, రాజులాల్, మోహన్, గోపి, సాయి రాజేశ్వర్, రాజేందర్, హుసేని కిరణ్, రాకేశ్, రాజశేఖర్, గంగాలాల్, సందీప్ పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో..

రుద్రూర్: చిక్కడపల్లిలో బోనాల పండుగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చెక్కుల అందజేత



వర్ని: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు మంగళవారం బాన్సువాడలో అందజేశారు. చందూర్ మండలానికి చెందిన 19 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ బాబా, మాజీ జెడ్పీటీసీ హరిదాసు, గిరి, బాలరాజు, చందూర్ సహకార సంఘం అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ద్యాగ ఉదయ్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జెస్సు అనిల్, పులి యుగేందర్, రాజేశ్వర్, దొండి ప్రకాష్, విజయానంద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య వార్షిక మహాసభ



పెర్కిట్: ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య 17వ వార్షిక మహాసభ నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం గంగారాం సమాఖ్య 2023–24 ఆర్థిక సంవత్సరం లావాదేవీలను చదివి వినిపించారు. రాబోయే సంవత్సరానికి ప్రణాళికలను రూపొందించారు. అనంతరం మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆర్మూర్ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎం స్పందన, కార్యదర్శిగా ఎస్ సౌందర్య, కోశాధికారిగా ఎస్ శైలజ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంచే ఏపీఎం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘాల అధ్యక్షురాలు, కార్యదర్శులు, వీవోఏలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిని నియమించండి

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి సహకార సంఘానికి కార్యదర్శిని వెంటనే నియమించాలని కోరుతూ డీసీవోకు చైర్మన్ జక్క రాజేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉందని, గత పాలకవర్గం చేసిన తప్పిదాలను చూపుతూ సహకార సంఘానికి కావాల్సిన ఎరువులను సరఫరా చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతల పూడ్చివేత



ఎడపల్లి: మండలంలోని బషీర్ ఫారం వద్ద ఏర్పడిన ప్రమాదకర గుంతలను మండల జర్నలిస్టులు మంగళవారం పూడ్చివేశారు. గుంతల విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో జర్నలిస్టులు ప్రమాదకరంగా ఉన్న ఎనిమిది గుంతలను మట్టితో పూడ్చివేశారు.

గుంతల చింత తీరేదెప్పుడో..!

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



రెంజర్లలో గుంతలమయంగా మారిన రోడ్డు

బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలో పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న తారు రోడ్లు గుంతల మయంగా మారాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం నుంచి మెండోరా మండల కేంద్రం వరకు ఉన్న తారు రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముప్కాల్ మండలం వేంపల్లి నుంచి రెంజర్ల వరకు ఉన్న తారు పూర్తిగా ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. నల్లూర్ చౌరస్తా 44వ జాతీయ రహదారి నుంచి పెద్ద వాగు వరకు ఉన్న తారు రోడ్డుపై సైతం పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో గుంతల్లో వర్షపు నీరు నిలిచి లోతు తెలియక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



రెంజర్ల-వేంపల్లి మధ్య ఏర్పడిన గుంతలు



పెద్దవాగు రోడ్డుపై ఏర్పడిన గుంతలు

చినుకు పడితే చిత్తడే..



బురదమయంగా మారిన గోదాం రోడ్డు

బాల్కొండ: ముప్కాల్ మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రోడ్లు చిత్తడిగా మారాయి. మండలంలోని రెంజర్లలో సహకార సంఘం గోదాంకు వెళ్లే దారిపై వేసిన సిమెంట్ రోడ్డులో నాణ్యత లోపించింది. దీంతో రోడ్డుపై నీరు చేరుతుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ రోడ్డు నిర్మాణంలోనే సిమెంట్ లేకుండా నిర్మించారనే ఆరోపణలు వచ్చాయి. అధికార పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్ అవతారాలు ఎత్తడంతో అధికారులు చేసేదేమీ లేక వారు చేసిందే పని.. వీరు చూసిందే నాణ్యత అన్నట్లు సాగాయి. కానీ ప్రస్తుతం ఆ డొల్లాతనం బయట పడుతోంది. ప్రస్తుతం పంటల కోసం కావాల్సిన ఎరువులకు గోదాముకు వెళ్లాలంటే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

సీసీ డ్రైయినేజీ అంతే..

గోదాం వైపు వెళ్లే రోడ్డు పక్కన రెండేళ్ల క్రితం సీసీ డ్రైయినేజీ నిర్మించారు. కానీ అది నిర్మించి ఏడాది గడవక ముందే కుప్ప కూలింది. దీంతో నాటి నుంచి సీసీ డ్రైయినేజీని అలానే ఉంచారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వర్షాలు కురిసి నీటి ప్రవాహనికి ఇబ్బంది కలుగుతుందని కూలిన డ్రైయినేజీ నుంచి పూడికను తొలగించారు. గోదాములోకి ఎరువులను పెద్దపెద్ద వాహనాల్లో తీసుకు పోవడంతోనే వైబ్రెషన్‌తో డ్రైయినేజీ కూలిపోయిందని సెలవిచ్చారు. దీంతో సీసీ డ్రైయినేజీ పునరుద్ధరణ లేకుండా పోయింది. ఉన్నతాధికారులు స్పందించి పనుల నాణ్యతపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి పనులను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసత్య ఆరోపణలు తగవు



భీమ్‌గల్: కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి అన్నారు. పట్టణ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం బీఆర్ఎస్‌నాయకులు నిర్వహించిన బూటకపు ధర్నా లో కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేయటం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. సమావేశంలో జేజే నర్సయ్య, కుంట రమేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలకు ఆదర్శం

ఆర్మూర్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు ఆదర్శమని ఆర్మూర్ క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ అన్నారు. మామిడిపల్లిలోని తపస్వి ఆశ్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రాజెక్టు చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, నరహరి, జీవీ నర్సింహారెడ్డి, అంబల్ల తిరుపతి, ద్యాగ ఉదయ్, చెన్న రవి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

నందిపేట్/ బోధన్/ ఎడపల్లి: నందిపేట, బోధన్, ఎడపల్లి మండల కేంద్రాల్లో లయన్స్ క్లబ్ సభ్యులు పేదలకు అన్నదానం నిర్వహించారు. నందిపేటలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు శౌరిబాబు, బోధన్, ఎడపల్లిలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేశారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి, నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు ప్రిన్స్, వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆర్మూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నిశాంత్, కైఫ్, అర్షిల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

డొంకేశ్వర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గంగపుత్ర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయ స్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. సబ్సిడీపై ఇచ్చే చేపపిల్లలను నాణ్యమైనవి పంపిణీ చేయాలని, అలాగే గంగపుత్ర, బెస్త, గూండ్ల వారికి మాత్రమే కొత్త సంఘాలు చేయాలని కోరారు. పల్లికొండ అన్నయ్య, నారాయణ, సాయిలు, బాలగంగాధర్, సుదీర్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు..

మాక్లూర్: మండలంలోని మాదాపూర్‌లో అక్రమ మొరం దందాను నిలిపివేయాలని, వాటికి అనుమతులు ఇవ్వకూడదని కోరుతూ గ్రామ కమిటీ సభ్యులు తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా మొరం తరలిస్తూ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు జి వినోద్, వై వినోద్, బి శ్రీధర్, లక్ష్మణ్, ఎం గంగాధర్, సుధాకర్, గ్రామస్తులు ఉన్నారు.

బ్యాగుల పంపిణీ

నవీపేట: మండలంలోని బినోల ప్రభుత్వ పాఠశాల పేద విద్యార్థులకు నిజామాబాద్‌కు చెందిన కొందరు వ్యాపారులు ఉచితంగా బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు సతీశ్ వ్యాస్, వ్యాపారులు విజయ్, నిఖిల్ శర్మ, రోషిత్, గులాబని పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎన్నికల హామీల అమలుకు ఉద్యమించాలి

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని తట్టికోట కా లనీలో ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. నాయకులు పడాల శంకర్, సీహెచ్ గంగారాం, బాలయ్య, సాయిలు, రాజు, శంకర్, లక్ష్మీబాయి, అరుణ పాల్గొన్నారు.

ఏబీవీపీ ధర్నా

బోధన్: పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థి సాయిరాం అదృశ్య ఘటనకు నిరసనగా ఏబీవీపీ నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసులు పాఠశాలకు చేరుకుని నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

నాయకుల ముందస్తు అరెస్టులు

బోధన్: జీపీ కార్మికులు, ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వెళ్లకుండా అడ్డుకునేందుకు సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, యేశాల గంగాధర్‌ను సోమవారం అర్ధరాత్రి ఇళ్లలోకి వెళ్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి మంగళవారం మధ్యాహ్నం విడుదల చేశారని నాయకులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుల అరెస్ట్ అన్యాయం

రుద్రూర్: ఎన్నికల హామీలను అమలు చేయాలని హైదరాబాద్‌కు తరలుతున్న సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం అన్యాయమని జీపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మచ్కూరి అశోక్, శానం శ్రీకాంత్ అన్నారు. ప్రభుత్వం పోలీసుల ద్వారా నాయకులకు నోటీసులు ఇచ్చి నిర్బంధించడం సమంజసం కాదన్నారు.

ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలి

మోర్తాడ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేశ్, జైడి గంగారెడ్డి, ఏలేటి సాయన్న, కుంట శ్రీనివాస్, కస్ప రాజేశ్వర్, రాజారెడ్డి, కొమ్ముల శేఖర్, బావాల చిన్న నర్సయ్య, గోపిడి ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

శెట్‌పల్లిలో విద్యాంజలి కార్యక్రమం

మోర్తాడ్: మండలంలోని శెట్‌పల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కరుణ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాంజలి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ట్రస్ట్ ద్వారా సేమియా, సోన్‌పాపడ్, మొలకెత్తిన శనగలు పోషక పదార్థాలను అందించారు. తాడూరి నర్సయ్య, తుమ్మల రాజ్‌కుమార్, పెగడ కిశోర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆర్మూర్: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు రోటరీ క్లబ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ చెత్త వాహనాలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఆడియోను లింక్ చేసి అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు రజనీశ్ కిరాడ్, ఆనంద్, సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు

నాణ్యమైన చేపపిల్లలు పంపిణీ చేయాలి

డొంకేశ్వర్: ఉచిత చేపపిల్లల పంపిణీలో భాగంగా నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని దత్తాపూర్ మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు.ఇందులో హరీశ్, ముఖేశ్, శ్రీనివాస్, మల్కన్న, తేజ, మహేశ్, తదితరులు ఉన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం

వర్ని(మోస్రా): మోస్రా జెడ్పీ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల ల్యాబ్ కోసం తమ వంతుసాయంగా రూ. 15 వేల విరాళాన్ని ఇన్‌చార్జి హెచ్ఎం బాలాజీరావుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సైనాపురం నర్సారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రావణ్, పోస్ట్‌మన్ వాజిత్, టీచర్లు వాణి, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లను పంపిణీ చేయాలి

బోధన్: పట్టణ శివారులో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలని కోరుతూ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌కు బీఆర్ఎస్ పట్టణ ప్రతినిధులు మంగళవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రామకృష్ణ, రవి శంకర్‌గౌడ్, సంజీవ్ పటేల్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో తిథి భోజనం

వేల్పూర్: జాతీయ విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రప్రభుత్వం పాఠశాలల్లో చేపట్టిన శిక్షా సప్తాహం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు తిథి భోజనం వడ్డించారు. డబుల్ కా మీఠా, మిర్చి, అరటిపండ్లు వంటి ప్రత్యేక వంటకాలను వడ్డించారు. కార్యక్రమాల్లో పడగల్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హసీనా బేగం, హెచ్ఎంలు రాంచందర్, హరిచరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజం

ఆర్మూర్‌టౌన్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకమహాలక్ష్మి అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన గంగాధర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చిరంజీవి, చిన్నయ్య, గంగాధర్, ఇర్ఫాన్, గంగారం, వెంకటేశ్, స్వాతి, సంధ్య, వనిత, రాజకళ పాల్గొన్నారు.

టీజీవీపీ ఆవిర్భావ దినోత్సవం

బోధన్: టీజీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నాగేశ్, శశిధర్, నిఖిల్, శివకుమార్ పాల్గొన్నారు.

పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలి

కమ్మర్‌పల్లి: సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా, డయేరియా, చికెన్ గున్యా, డెంగీ వ్యాప్తి చెందే అవకాశముందని ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చౌట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సుప్రియ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది చేపడుతున్న సర్వేను మంగళవారం పర్యవేక్షించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో సత్యనారాయణ, ఏఎన్ఎం గీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పట్టించుకోని కేంద్రం

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ ప్రజల సమస్యలను గాలికి వదిలేసిందని వామపక్షాల నాయకులు అన్నారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో మతోన్మాదం ప్రజలపై ప్రభావం అనే అంశంపై వామపక్షాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బడ్జెట్ సమావేశాల్లో రైతాంగానికి మద్దతు ధర చట్టాన్ని పార్లమెంట్‌లో పెట్టకుండా కాలయాపన చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎ రమేశ్‌బాబు, పల్లవి వెంకటేశ్, బి దేవారాం, సూర్య శివాజీ, ఆరేపల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా రుణమాఫీ సంబురాలు



ముప్కాల్‌లో సీం సందేశాన్ని వింటున్న రైతులు



డొంకేశ్వర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం



బాల్కొండలో పటాకులు కాలుస్తున్న నాయకులు

బోధన్/ బాల్కొండ/ మోర్తాడ్/ డొంకేశ్వర్: రుణమాఫీ రెండో విడత నిధుల విడుదలపై అన్ని మండలాల్లోని రైతులు రుణమాఫీ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్ల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జి చిత్రపటాలకు పార్టీ నాయకులు, రైతులు మంగళవారం పాలాభిషేకం చేశారు. బోధన్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, మోర్తాడ్, డొంకేశ్వర్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో రైతులు రెండో విడత నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. రైతు వేదికల్లో సీఎం రేవంత్‌రెడ్డి సందేశాలను రైతులు వీక్షించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుందని పార్టీ నాయకులు అన్నారు. సంబురాల్లో రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బోధన్‌లో కాంగ్రెస్ నాయకుల సంబురాలు



మోర్తాడ్ రైతు వేదికలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి, రైతులు

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం

- టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్



మాట్లాడుతున్న వేణుగోపాల్‌యాదవ్

కమ్మర్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తమ కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రైతు రుణమాఫీ రూ. 1.50 లక్షలు మాఫీ చేసిన సందర్భంగా మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండో విడతలో దాదాపు 6.40 లక్షల మందికి రూ. 6190 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయని వెల్లడించారు. ఆగస్టు 15 లోపు పూర్తి స్థాయి రుణమాఫీ చేస్తుందన్నారు. దేశంలో రైతులకు, నిరుద్యోగులకు మాట ఇస్తే నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. సమావేశంలో పడిగేల ప్రవీణ్, బుచ్చి మల్లయ్య, గోపిడి లింగారెడ్డి ఉట్నూర్ ప్రదీప్, సింగిరెడ్డి శేఖర్, రేవతి గంగాధర్ కుందేటి శ్రీనివాస్, శ్రీరాముల మురళి, పూజారి శేఖర్, జగదీశ్, ఏనుగు మనోహర్, సజన్, గణేశ్ మోహన్ నాయక్, శైలందర్ హన్మాండ్లు, అజర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బేషరతుగా రుణమాఫీ చేయాలి

వేల్పూర్/ బాల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణాల మాఫీని ఎలాంటి కొర్రీలు లేకుండా ఏకకాలంలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వేల్పూర్ తహసీల్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో మల్కన్నగారి మోహన్, ఏలేటి రమేశ్‌రెడ్డి, దురాజీరవి, ఇతర నాయకులు పాల్గొన్నారు. రూ. రెండుల లక్షల రైతు రుణమాఫీని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు బాల్కొండలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. నవీన్, నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శీతల్ పండుగ

నవీపేట: మండలంలోని మద్దేపల్లి తండాలో గిరిజనులు శీతల్ పండుగను మంగళవారం నిర్వహించారు. తండాలోని యువతులు మొక్కజొన్న బుట్టలను ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

ఆర్థికసాయం అందజేత

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్‌కు చెందిన బుర్రోళ్ల నర్సుబాయి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి గ్రామస్తులు రూ.25,500 ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త డాక్టర్ శంకర్‌దాస్, మినుగు రాజేశ్వర్, శాంతి కుమార్, మాజీ వార్డు సభ్యులు బుర్రోళ్ల గంగాధర్, కోణాల ప్రశాంత్, వేల్పుల సతీశ్, మేడిపల్లి గిరీశ్, మేస్త్రి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: ఆశ వర్కర్ల జీతాల పెంపు, పలు సమస్యలపై మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ఆశవర్కర్ల యూనియన్ పిలుపునిచ్చారు.. కాగ పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఆశ వర్కర్లు మాట్లాడుతూ.. తాము అసెంబ్లీ ముట్టడికి వెళ్లడం లేదని చెప్పినా వినకుండా పీఎస్‌కు తరలించారని వాపోయారు.

అధికారులు, సిబ్బందికి సన్మానం

రెంజల్: మండలంలో ఇటీవల బదిలీపై వెళ్తున్న అధికారులు, సిబ్బందిని మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీవోకు..

రుద్రూర్: మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న పి సాయిలును మండల పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సురేష్‌బాబు, సిబ్బంది సరిచంద్, శ్రీనివాస్, విజయలక్ష్మి, విజయ, ఈజీఎస్ ఏపీవో మనోహర్, జీపీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుగ్గిలం అశోక్‌ను..

వేల్పూర్: హైదరాబాద్‌లో ఆగస్టు 11న నిర్వహించే 10 కె రన్‌కు వేల్పూర్‌కు చెందిన గుగ్గిలం అశోక్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక కావడంతో ఆయనను స్థానిక వీడీసీ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రాయన్ (తెలుగు) - 11.40. కల్కి 2898 ఏడీ (తెలుగు) - 2.50. 6.35. 10.20
స్క్రీన్-2 –	డెడ్‌పూల్ 3డీ (తెలుగు)- 10.30. 1.30. 4.30. 7.30. 10.30
స్క్రీన్-3 –	రాయన్ (తెలుగు) - 01.00. 4.10. 7.20. 10.30
స్క్రీన్-4 –	శివం భజే (తెలుగు) - 11.00. 1.45 4.30. 7.35. 10.00